ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
తమిళనాడు
TAMILNADU
శనివారం 17 ఫిబ్రవరి 2024

35రోజుల్లో 3.5లక్షల మంది సమస్యల పరిష్కారం

● 'ప్రజలతో ముఖ్యమంత్రి' సభలో సీఎం స్టాలిన్ ●1598 మంది యువకులకు ఉద్యోగాలు



కలైవానర్ అరంగంలో ఏర్పాటైన సభలో ఓ మహిళకు ద్విచక్రవాహనం తాళం చెవిని అందిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆ దిశగానే 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకం ద్వారా రాష్ట్ర మంతటా 2058 ప్రత్యేక శిబిరాలు నిర్వహించి 35 రోజుల్లో 3.50 లక్షల మంది ప్రధాన సమస్యలను పరిష్కరించామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. చేపాక్ కలైవానర్ అరంగంలో శుక్రవారం ఉదయం ముదల్వరిన్ ముగవరి (ముఖ్యమంత్రి చిరునామా) శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శిబిరాల్లో అందిన దరఖాస్తులను పరిష్కరించి, ఎంపికైన లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు, 'స్కూటర్లు తదితరాలను పంపిణీ చేసి, టీఎన్‌పీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 1,598 మంది యువకులకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ... 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. 'క్షేత్ర పరిశీలనలో ముఖ్యమంత్రి' పథకం అమలులో భాగంగా తాను జిల్లాలవారీగా అధికారుల సమావేశంలో పాల్గొన్నప్పుడు సామాన్య ప్రజానీకం యేళ్ల తరబడి సమస్యలతో సతమతమవుతున్నట్లు స్వయంగా తెలుసుకున్నానన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకే 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను పరిష్కరించగలిగానన్నారు. రాష్ట్ర ఇంధనశాఖ, రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, నగరపాలక శాఖ, ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ, బీసీలు, ఎంబీసీల, మైనారిటీల శాఖ, పోలీసు శాఖ, గృహనిర్మాణ శాఖ, నగరాభివృద్ధి శాఖ, కార్మిక సంక్షేమ శాఖ సహా 13 శాఖలకు సంబంధించి ప్రజల నుంచి అందిన వినతిపత్రాలపై చర్యలు తీసుకున్నట్లు ప్రకటించారు. రెవెన్యూ శాఖ తరఫున 42 వేలకుపైగా పట్టాల మార్పిడి, 18వేల మందికిపైగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయాలు, ఇంధన, విద్యుత్ శాఖల ద్వారా 26,383 మందికి కొత్త విద్యుత్ కనెక్షన్లు, నగరపాలకశాఖ ఆధ్వర్యం 37,705 మందికి తాగునీటి సదుపాయం, భవన నిర్మాణానికి అనుమతులు, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఆదిద్రావిడుల సంక్షేమశాఖ ద్వారా 435 మంది ఇంటి పట్టాలు, టైలరింగ్ మెషిన్లు, రుణ సదుపాయాలు, మహిళాభ్యుదయ శాఖ తరఫున 1.42 కోట్ల మేరకు 23 మహిళా స్వయం ఉపాధి సంఘాలకు రుణాల మంజూరు, దివ్యాంగుల సంక్షేమ శాఖ తరఫున 3659 మందికి రూ.9.46కోట్లతో మూడు చక్రాల సైకిళ్లు, రుణాలు, ఉపకరణాల పంపిణీ, గుర్తింపు కార్డుల జారీ చేసినట్లు చెప్పారు.

మేనిఫెస్టో లేనివి కూడా...

రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎన్నికల మేనిఫెస్టోలో లేని పథకాలను కూడా అమలు చేసినట్లు సీఎం చెప్పారు. మహిళలకు వెలుగుబాట పయనం (సిటీ, టౌన్ బస్సుల్లో ఉచిత ప్రయాణ) పథకం, పుదుమైపెణ్ (టెన్త్, ప్లస్2 దాకా ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థినులు ఉన్నత విద్యాకోర్సులు అభ్యసించడానికి ప్రతినెలా రూ.1000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే) పథకం, బడిపిల్లల అల్పాహార పథకం, కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం, ఇళ్ల వద్దకే విద్య, ప్రజల వద్దకే వైద్యం, ఒలంపిక్ క్రీడా విజేతలకు నగదు కానుకల పంపిణీ, నాన్ ముదల్వన్, మీ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి, ముదల్వరిన్ ముగవరి, క్షేత్ర పరిశీలనలో ముఖ్యమంత్రి వంటి పథకాలు సత్ఫలితాలనిస్తున్నట్లు చెప్పారు.

ప్రజలకు అండగా...

అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వారితోనే జీవించాలంటూ అన్నాదురై, కరుణానిధి చెబుతుండేవారని, వారి మాటలను అనుసరించడమే తన ధ్యేయమని స్టాలిన్ పేర్కొన్నారు. అధికారంలో లేకుంటే ప్రజలకోసం పోరాడుతామని, అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమం కోసం పాటుపడతామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సక్రమంగా అందుతున్నాయో లేదో గుర్తించేందుకే తాను జిల్లాల వారీగా క్షేత్ర పరిశీలనకు వెళ్లి ఆయా జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తుండటం కూడా సత్ఫలితాలనిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీ.కే.శేఖర్‌బాబు, అనితా రాధాకృష్ణన్, ఉదయనిధి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ, ఎంపీలు దయానిధిమారన్, డాక్టర్ కళానిధి వీరాసామి, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్, 'ముదల్వరిన్ ముగవరి' శాఖ ప్రత్యేక అధికారి శిల్పా ప్రభాకర్ సతీష్, దివ్యాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించండి

● రైతులకు మద్దతుగా కార్మిక సంఘాల సమాఖ్య ఆందోళన
● అన్నాసాలైలో ధర్నా
● 800మంది అరెస్టు


అన్నాసాలైలో ధర్నా

అడయార్, ఫిబ్రవరి 16: కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళనకు రాష్ట్రంలోనూ విశేష మద్దతు లభిస్తోంది. వారికి మద్దతుగా వివిధ కార్మిక సంఘాల సమాఖ్య శుక్రవారం చెన్నైలో భారీస్థాయిలో ఆందోళన చేసింది. దీనికి భారీగా తరలివచ్చిన కార్మికులు ఎలాంటి అనుమతి లేకుండా అన్నాసాలైలో ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు 800 మందిని అరెస్టు చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు చెందిన నేతలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన రైతులు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నారు. ఇది శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ రైతులకు మద్దతుగా కార్మిక సంఘాల సమాఖ్య నగరంలో ఆందోళనచేసింది. అన్నాసాలైలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద మాత్రమే ఆందోళనకు నగర పోలీసులు అనుమతి ఇచ్చారు. దీంతో సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ సహా దాదాపు పదికిపైగా కార్మిక సంఘాల సమాఖ్యకు చెందిన నేతలు, కార్మికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఎంపీ, కార్మిక సంఘం నేత కె.నటరాజన్, సీఐటీయూసీ అధ్యక్షుడు జి.సుకుమారన్, ఏఐటీయూసీ అధ్యక్షుడు రాధాకృష్ణన్ రాజా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న నేతలు, కార్మికులంతా కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో కార్మిక సంఘాల నేతలు ప్రసంగిస్తూ, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. రైతులు ఉత్పత్తి చేసే ఆహార ధాన్యాలకు తగిన గిట్టుబాటు ధరను కల్పించడంతో పాటు రాయితీని కల్పించాలని కోరారు. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా అనేక చట్టాలను చేస్తుందని, ఇలాంటి చర్యలను ఉపసంహరించుకోవాలని సూచించారు. కార్మికులకు హానికలిగించేలా రూపొందించిన చట్టాల్లో మార్పులు చేయాలన్నారు. పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే చర్యలను విరమించుకోవాలని సూచించారు. కార్మికులకు నెలవారీ కనిష్ఠ వేతనంగా రూ.26 వేలు నిర్ణయించాలని వారంతా కోరారు.

మెరుపు ధర్నా

పోస్టాఫీసు పక్కన ఆందోళన చేస్తున్న కార్మికులంతా నేతల ప్రసంగం ముగిసిన వెంటనే అన్నాసాలైలో భైఠాయించారు. నిజానికి పోస్టాఫీస్ పక్కన ఆందోళన చేసేందుకు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. కానీ, ధర్నా చేసేందుకు అనుమతి ఇవ్వలేదు. కానీ, కార్మికులతో కలిసి కార్మిక సంఘాల నేతలు ఒక్కసారిగా ధర్నాకు దిగడంతో రంగప్రవేశం చేసిన పోలీసులు 800 మందిని అరెస్టు చేశారు. ఈ కారణంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

తిరుప్పూరులో 500 మంది అరెస్టు



అదేవిధంగా రాష్ట్రంలో వస్త్రపరిశ్రమకు ప్రధాన కేంద్రంగా ఉన్న తిరుప్పూరులో కూడా రైతులకు మద్దతుగా కార్మికులు ధర్నా చేశారు. రైతుల డిమాండ్లను పరిష్కరించాలన్న ప్రధాన డిమాండ్‌తో పాటు కార్మికులకు నెల వేతనం కనిష్ఠంగా రూ.26 వేలు నిర్ణయించాలని, నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని, రైల్వే, రక్షణ, విద్యుత్ వంటి పబ్లిక్ సంస్థలను ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ డిమాండ్ చేశారు. తిరుప్పూరు రైల్వే స్టేషన్ ఎదుట జరిగిన ధర్నాలో పాల్గొన్న కార్మికులు అక్కడి నుంచి ఊరేగింపుగా జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీసు వద్దకు చేరుకుని రోడ్డుపై భైఠాయించారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు 500 మందిని అరెస్టు చేశారు.

● తహసీల్దార్‌పై దాడి కేసులో

అళగిరి సహా 17 మంది విడుదల


కోర్టు హాలు వద్ద అళగిరి బృందం

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన తహసీల్దార్‌పై జరిగిన దాడి కేసులో నిందితులుగా ఉన్న కేంద్ర మాజీమంత్రి ఎంకే అళగిరి సహా 17 మందిని విడుదల చేస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వీరిని నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. 2011లో శాసనసభ ఎన్నికల సందర్భంగా మదురై జిల్లా మేలూరు సమీపంలో అంబలకారన్‌పట్టి వల్లవడికార ఆలయాన్ని కేంద్ర మాజీమంత్రి ఎంకే అళగిరి ఆయన అనుచరులు సందర్శించారు. అదే సమయంలో ఆ ఆలయంలో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం తెలియటంతో మేలూరు ఎన్నికల అధికారిగా ఉన్న తహసీల్దార్ కాళిముత్తు తనిఖీ కోసం వెళ్లారు. ఆ సందర్భంగా అళగిరి అనుచరులు కొందరు తహసీల్దార్‌పై దాడి జరిపినట్లు కీళ్‌వలైవు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఎంకే అళగిరి, అప్పటి మదురై కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మన్నన్, రఘుపతి, తిరుజ్ఞానం సహా 21మందిపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన సహా నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసుపై మదురై జిల్లా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో 13 యేళ్లపాటు విచారణ జరిగింది. విచారణ సమయంలో అళగిరి సహా నిందితులు హాజరయ్యారు. గత వారం ఈ కేసులో వాదోపవాదాలు ముగియటంతో మేజిస్ట్రేట్ తీర్పు తేదీని ప్రకటించకుండా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి శుక్రవారం ఉదయం తీర్పును మేజిస్ట్రేట్ ముత్తులక్ష్మి వెలువరించారు. ఆ సందర్భంగా అళగిరి సహా 17 మంది హాజరయ్యారు. తహసీల్దార్‌పై దాడి జరిగినట్లు ప్రాసిక్యూషన్ తరఫున ఆధారాలను సమర్పించకపోవడంతో వారిని విడుదల చేస్తూ మేజిస్ట్రేట్ ముత్తులక్ష్మి తీర్పును వెలువరించారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షా విధానంలో మార్పు

● ఐచ్ఛిక పాఠ్యాంశంలో 35శాతం మార్కులు తప్పనిసరి
● వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు ● పాఠశాల విద్యాశాఖ ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగు, మలయాళం, హిందీ, ఉర్దూ తదితర మైనారిటీ భాషలను ఐచ్ఛిక పాఠ్యాంశంగా ఎంపిక చేసుకునే విద్యార్థులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షా విధానంలో కొత్త మార్పును తీసుకువస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఈ మార్పులు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కుమారగురుబరన్ తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఒక్కో పాఠ్యాంశానికి 100 మార్కులు చొప్పున ఐదు పాఠ్యాంశాలకు మొత్తం 500 మార్కులకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అంతే కాకుండా 2006 నుంచి పదో తరగతి వరకు తమిళభాషను పాఠ్యాంశంగా తీసుకోకుండా మలయాళం, ఉర్దూ, హిందీ మాధ్యమం విద్యార్థులు ఉత్తీర్ణులవుతూ వచ్చారు. పదో తరగతి వరకైనా తమిళాన్ని నేర్చుకుని పరీక్షలు రాసేలా ఓ చట్టాన్ని కూడా తీసుకువచ్చారు. ఆ మేరకు పదో తరగతి చదివే విద్యార్థులందరూ, తెలుగు, మలయాళం, ఉర్దూ తదితర మైనార్టీ భాషలకు చెందిన విద్యార్థులు పదో తరగతిలో తమిళభాషను ఓ పాఠ్యాంశంగా స్వీకరించి ఉత్తీర్ణులు కావాలనే నిబంధన అమలులోకి వచ్చింది. అదే సమయంలో మైనారిటీ భాషలకు చెందినవారు తమ మాతృభాషను ఐచ్ఛిక పాఠ్యాంశంగా చేసుకుని పరీక్ష రాసేందుకు అనుమతించాలని కోరుతూ వచ్చారు. దీంతో నాలుగో పాఠంగా ఐచ్ఛిక పాఠ్యాంశం రాసే విధానం అమలులోకి వచ్చింది. ఆ మేరకు తమిళేతరులైన ఇతర భాషలకు చెందిన విద్యార్థులు ఆ ఐచ్ఛిక పాఠ్యాంశాన్ని ఎంపిక చేసుకుని పరీక్ష రాయవచ్చని ప్రకటన జారీ అయ్యింది. అయితే ఆ ఐచ్ఛిక పాఠ్యాంశం పరీక్ష రాసినా అందులో పొందిన మార్కులను ఉత్తీర్ణతకు అర్హమైనవిగా పరిగణించలేదు. పదో తరగతి సర్టిఫికెట్‌లోనూ ఆయా విద్యార్థులు ఎన్ని మార్కులు పొందారనే వివరాలు మాత్రమే నమోదయ్యేవి. ఆ విద్యార్థి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడా లేదా అనే వివరాలు ఉండవు. ఈ నేపథ్యంలో మైనార్టీ భాషలకు చెందిన కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మార్కుల జాబితాలో తమ భాషకు సంబంధించిన పాఠ్యాంశంలో పొందిన మార్కులు పొందుపరచకపోవడం శోచనీయమని, ఈ ఐచ్ఛిక పాఠ్యాంశాన్ని కూడా ఉత్తీర్ణతకు అవసరమైన మార్కులుగా పరిగణనలోకి తీసుకోవాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఐచ్ఛిక పాఠ్యాంశాన్ని అర్హతకు సంబంధించిన పాఠ్యాంశంగా పరిగణనలోకి తీసుకోవాలంటూ తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఆ తీర్పును అనుసరించే పాఠశాల విద్యాశాఖ తాజా ఉత్తర్వులను జారీ చేసింది. ఆ మేరకు వచ్చే విద్యా సంవత్సరం (2024-2025) నుండి తెలుగు, మలయాళం, ఉర్దూ మాతృభాషలుగా కలిగినవారు తమ భాషకు సంబంధించిన పాఠ్యాంశాన్ని ఐచ్ఛిక పాఠ్యాంశంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీనితో మైనార్టీ భాషలకు చెందిన విద్యార్థులు ఇకపై ఆరు పాఠ్యాంశాలు కలిగి 600 మార్కులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. అదే సమయంలో ఈ ఐచ్ఛిక పాఠ్యాంశంలో విద్యార్థులు 100కి 35 మార్కులు పొందితేనే ఉత్తీర్ణులైనట్లు పరిగణిస్తారు. తమిళభాషను మాతృభాషగా కలిగిన వారికి ఈ కొత్త ఉత్తర్వులు వర్తించవని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రా క్లబ్‌లో ఎన్నికలు జరపండి


● సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేతిరెడ్డి
● ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు ● విచారణ 3 వారాలకు వాయిదా

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఎన్నికల జరగకుండా, కేవలం ఆపద్ధర్మ, తాత్కాలిక కమిటీలతో నడుస్తున్న టి.నగర్‌లోని 'ఆంధ్రా క్లబ్'కు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ క్లబ్ సభ్యుడు, తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరువర్గాల మధ్య ఆధిపత్యపోరు కారణంగా ఎనిమిదేళ్లుగా క్లబ్‌కు ఎన్నికలు జరగలేదని, ఈ కారణంగా క్లబ్ ఆలనాపాలనా కరువైపోయిందని పిటిషన్‌లో వాపోయారు. 3 వేలమంది సభ్యులున్న క్లబ్‌లో సరైన కమిటీ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను త్వరగా తేల్చి, సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని కేతిరెడ్డి అభ్యర్థించారు. శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జస్టిస్ అగస్టిన్ జార్జి మాష్ నేతృత్వంలోని ధర్మాసనం తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.


కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

డీఎంకేకు ఎడప్పాడి దాసోహం

● ఓపీఎస్ ఆగ్రహం


మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం

ప్యారీస్, ఫిబ్రవరి 16: 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే సిద్ధాంతంలో ద్వంద్వవైఖరి అవలంబిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డీఎంకేకు కొమ్ము కాస్తున్నారని మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... 2022వ సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పళనిస్వామి, ఒకే దేశం ఒకే ఎన్నిక అమలుకు వస్తే పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఒకే సమయంలో ఎన్నికలు జరిగే అవకాశముంటుందని, ప్రస్తుత డీఎంకే పాలన అధికారం నుంచి దిగిపోతుందని విమర్శించారన్నారు. అయితే ఇప్పుడు ఆ అభిప్రాయాన్ని మార్చుకొని డీఎంకేకు దాసోహమై అన్నాడీఎంకే సిద్ధాంతాలను మంటగలుపుతున్నారని విమర్శించారు. ఈ నెల 14న రాష్ట్ర అసెంబ్లీలో డీఎంకే ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశపెట్టిందని, ఈ తీర్మానానికి అన్నాడీఎంకే ఏకగ్రీవంగా మద్దతు పలికిందన్నారు. దీన్నిబట్టి ఎడప్పాడి ఎవరన్నది స్పష్టమైందని తెలిపారు. డీఎంకే దుష్టశక్తి అని పదేపదే అన్నాడీఎంకే బహిరంగ సభలు, ధర్నా వేదికలపై ప్రకటించిన పళనిస్వామి, ప్రస్తుతం అధికార డీఎంకేతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని అన్నాడీఎంకే అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, సుమారు 2 కోట్ల మందికి పైగా సభ్యులున్న అన్నాడీఎంకేకు ద్రోహం తలపెట్టిన ఈపీఎస్‌ను కార్యకర్తలు నిలదీయాలని ఓపీఎస్ పిలుపునిచ్చారు.

సమాచార దర్శిని

నేడు సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 16: స్థానిక ఆవడి డిపో సమీపంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా రాత్రి వేళ సబర్బన్ రైలు సర్వీసుల్లో మార్పులు చేపట్టినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. శనివారం రాత్రి 10.25 నుంచి 18వ తేది తెల్లవారుజామున 4.30 గంటలకు పనులు జరుగుతుండడంతో, ఆ సమయంలో నడిచే 15 సబర్బన్ రైళ్లు పూర్తిగా, మరో 12 రైళ్లు పాక్షికంగా రద్దు చేశారు.

నేడు చేపల వేట నిషేధం

పెరంబూర్, ఫిబ్రవరి 16: స్థానిక పళవేర్కాడు జాలర్లు ఈనెల 17న శనివారం చేపల వేటకు వెళ్లేందుకు నిషేధం విధించారు. ఆంధ్ర రాష్ట్రం శ్రీహరికోట నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్-14 రాకెట్ శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రయోగించనుండగా, కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో, తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు జాలర్లు శనివారం చేపల వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

19నుంచి 'చిన్నమలై'లో పార్కింగ్ వసతి

పెరంబూర్, ఫిబ్రవరి 16: స్థానిక చిన్నమలై మెట్రో రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ వసతి ఈ నెల 19వ తేది నుంచి అందుబాటులోకి రానుంది. ఈ పార్కింగ్‌లో చేపట్టిన మరమ్మతుల కారణంగా రెండు నెలలుగా పార్కింగ్ మూసివేశారు. ప్రస్తుతం పునరుద్ధరించిన పార్కింగ్ సౌకర్యం ఈనెల 19న సోమవారం నుంచి అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు.

రేపటి వరకు స్టార్టప్ దరఖాస్తులకు అవకాశం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: స్టార్టప్ ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకొనేందుకు ఈనెల 18న ఆదివారం వరకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల సంస్థల శాఖ ఆధ్వర్యంలో స్టార్టప్ టీఎన్ సంస్థ పనిచేస్తోంది. టాన్సిట్ పథకం కింద వృత్తుల సంస్థలకు రూ.15 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆసక్తి ఉన్న సంస్థల నుంచి దరఖాస్తు స్వీకరణ జనవరి 25 నుంచి ఈనెల 7వ తేది వరకు జరిగింది. ఇంకా కొన్ని సంస్థలు దరఖాస్తు చేసుకోకపోవడంతో గడువును పొడిగించారు.

కీలంబాక్కం నుంచి అదనంగా 120 బస్సులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: కీలంబాక్కం కొత్త బస్ టెర్మినల్ నుంచి అదనంగా 120 బస్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గత శుక్రవారం తిరుచ్చికి బస్సులు లేవని ప్రకటించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో అదనంగా 70 బస్సులను అధికారులు నడపాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ఆధ్వర్యంలో 361, ఇతర రవాణా సంస్థల ఆధ్వర్యంలో 734 బస్సులు నడుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి అదనంగా 120 బస్సులు నడిపారు.

20నుంచి ప్లస్‌టూ పరీక్షల హాల్ టిక్కెట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 16: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఈనెల 20వ తేది నుంచి హాల్‌టిక్కెట్లు పొందవచ్చు. విద్యార్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

22న సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: రహదారుల శాఖలో ఖాళీగా ఉన్న సహాయ అధికారి పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ ఈ నెల 22వ తేది జరగనున్నట్లు టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాలసుందరరాజ్ తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి గత ఏడాది మే 27వ తేది రాతపరీక్ష నిర్వహించి, మార్కులు, ర్యాంకుల వివరాలు సెప్టెంబరు 19వ తేది విడుదల చేశారు. వీరికి సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ 22వ తేది స్థానిక బ్రాడ్‌వే ఉన్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరగనుంది.

25న డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ ప్రసంగం

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో జరుగుతున్న 'తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక' కార్యక్రమంలో భాగంగా ఈనెల 25వ తేదీన టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ ఉపన్యసించనున్నారు. 'సారంగు తమ్మయ కవి విరచిత వైజయంతీ విలాసము' అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు. టి.నగర్ విజయ రాఘవరోడ్డులో ఉన్న ఆంధ్రా క్లబ్‌లో 25వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సిడ్కో ఫిర్యాదులకు ఈ-మెయిల్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: రాష్ట్రప్రభుత్వ చిన్నవృత్తుల అభివృద్ధి సంస్థ (సిడ్కో) ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఈ-మెయిల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ సంస్థ రహదారులు, మౌలిక వసతులతో ఇండస్ట్రియల్ ఎస్టేట్లు ఏర్పాటు చేస్తోంది. వాటిలో ఉన్న కర్మాగారాలను సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల సంస్థలకు అందిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 130 సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్లలో వందల సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిలో రోడ్ల ధ్వంసం కావడం, వర్షపు నీరు చేరడం వంటి సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. వీటితో సహా ఇతర సమస్యలపై ఎస్టేట్ సంఘస్తులు, కార్మికులు ఫిర్యాదు చేసేందుకు grievanceredressal@tansidco.orgను సిడ్కో పరిచయం చేసింది.

రూ.1.79 కోట్లతో అదనపు తరగతి గదులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: స్థానిక వలసరవాక్కం మండలంలో ఉన్న మూడు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.79 కోట్లు కేటాయించింది. ఈ మండలంలో ఏడు మహోన్నత, ఆరు మాధ్యమిక, ఎనిమిది ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో 11 పాఠశాలలు ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. ఇక్కడ అదనపు తరగతి గదులు నిర్మించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. నొలంబూర్ రోడ్డు వీధిలోని పాఠశాలకు రూ.84.04 లక్షలు, పల్లవన్‌నగర్‌లో ఉన్న పాఠశాలకు రూ.31.20 లక్షలు, మేట్టుకుప్పం వీధిలో ఉన్న పాఠశాలకు రూ.63.76 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించారు.

విద్యుత్ ఫిర్యాదులకు మొబైల్ యాప్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: ఫిర్యాదు చేయడానికి 'టాన్‌జెడ్కో' యాప్‌ను ఈబీ అందుబాటులోకి తెచ్చింది. అన్నాసాలైలో ఉన్న బోర్డు ప్రధాన కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం పని చేస్తోంది. నెం.9498794987కు విద్యుత్ కోతలు, అదనపు విద్యుత్ ఛార్జీల వసూలు వంటి వాటిపై 24 గంటలు ఫిర్యాదు చేయవచ్చు. షిఫ్టుకు 63 మంది పని చేస్తున్నారు. ఒకే సమయంలో ఎక్కువ మంది ఫిర్యాదులు చేయడంతో పలువురికి లైన్ దొరకడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేలా యాప్‌లో బిల్లు చెల్లింపులు, కనెక్షన్ నమోదు ఇతర సేవలను పొందవచ్చు.

మోదీ ప్రభుత్వం మోసపూరిత ఆలోచనలు మానుకోవాలి

● ఎస్ఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శి కన్నయ్య

పార్యీస్, ఫిబ్రవరి 16: దేశంలో లక్షలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రైల్వే, ఓడరేవులు, బ్యాంకింగ్, ఎన్ఎల్‌సీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలన్న మోసపూరిత ఆలోచనలను కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం మానుకోవాలని సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్ఆర్ఎంయూ) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.కన్నయ్య డిమాండ్ చేశారు. స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని దక్షిణ రైల్వే జీఎం కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఎస్ఆర్ఎంయూ చెన్నై రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ... రైల్వే కార్మికులతో పాటు ఓడరేవులు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ వంటి ప్రైవేటు వ్యక్తుల చేతికి అప్పగించడం న్యాయం కాదని, ఈ చర్యలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో అమలులో ఉన్న 44 కార్మికుల చట్టాలను సవరించి కొత్తగా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కు తీసుకోవాలని, కార్మికుల సంక్షేమం నిమిత్తం పాత పింఛన్ పద్ధతినే అమలుపరచాలని కోరారు. పెరంబూర్‌లోని ఐసిఎఫ్‌లో డిజైన్ చేసిన వందే భారత్ రైళ్లలో ప్రయాణం చేసేందుకు విమానాల్లో ప్రయాణం చేయడం కంటే అధికంగా టిక్కెట్టు ధరలు పెంచారని, వీటిని కూడా ప్రైవేటీకరణ చేసే పనులను రైల్వే మంత్రిత్వ శాఖ సహకారంతో కేంద్రం దశలవారీగా చేపట్టిందని కన్నయ్య ఆరోపించారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న కన్నయ్య

మరుదమలై రహదారిలో చిరుత సంచారం

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లాలోని మరుదమలై మురుగన్ ఆలయం, అనువావి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం రహదారిలో చిరుత సంచరిస్తుండటంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు పోలీసులు ఆంక్షలు విధించారు. కోయంబత్తూరు జిల్లాలోని ఆనైకట్టి, తటాకం, పేరూరు, మరుదమలై, పోలువరంపట్టి, మదుక్కరై తదితర ప్రాంతాల్లో ఏనుగులు, చిరుతలు తదితర వన్యమృగాలు అధికంగా సంచరిస్తున్నాయి. రెండు రోజులకు ముందు మరుదమలై ఆలయ రహదారిలో చిరుత నింపాదిగా నడిచి వెళుతుండగా స్థానికులు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇదేవిధంగా అనువావి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలోనూ ఏనుగులు, చిరుతలు సంచరిస్తున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఈ పరిస్థితులలో మరుదమలై ఆలయ రహదారిలో కాలినడకగా వెళ్లే భక్తులపై పోలీసులు కొత్త ఆంక్షలు విధించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేదాకా మరుదమలై ఆలయ రహదారిలో రోజూ ఉదయం 6గంటల నుండి రాత్రి 7 గంటల వరకే భక్తులను, వారి వాహనాలను అనుమతించనున్నట్లు అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.



మరుదమలై ఆలయ రహదారిలో సంచరిస్తున్న చిరుత

విరింజిపురంలో వైభవంగా మహాకుంభాభిషేకం

వేలూరు, ఫిబ్రవరి 16: కాట్పాడి సమీపం బ్రహ్మపురంలో ఉన్న పురాతన తాయత్తమ్మన్ ఆలయ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో యాగశాలు ఏర్పాటుచేసి, పుణ్యనదుల నుంచి తీసుకొచ్చి తీర్థ కలశాలను ఉంచి రెండు రోజులు వేదమంత్రోచ్ఛరణల మధ్య యాగశాల పూజలు నిర్వహించారు. శుక్రవారం పూర్ణాహుతి అనంతరం పుణ్యతీర్థాలు ఉన్న కలశాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ విమానంపై ప్రోక్షించి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, ఆలయం తరపున భక్తులకు అన్నదానం చేశారు.



పింఛన్‌దారుల గ్రీవెన్స్

వేలూరు, ఫిబ్రవరి 16: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పింఛన్‌దారుల సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని పింఛన్‌దారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో పింఛన్‌దారుల డైరెక్టర్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ట్రెజరీ శాఖ మండల జాయింట్ డైరెక్టర్ శాంతిమణి, జిల్లా ట్రెజరీ అధికారి విమల, జిల్లా కలెక్టర్ అకౌంట్స్ పీఏ సుధారాణి, వేలూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్

300 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

వేలూరు, ఫిబ్రవరి 16: కలెక్టర్ ఉత్తర్వులతో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ తహసీల్దార్ సురేష్ కుమార్ నేతృత్వంలోని అధికారులు కాట్పాడి తాలూకా పొన్నై చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపటారు. ఆ సమయంలో రోడ్డు పక్కగా ఉన్న బస్తాలు పరిశీలించి, అందులో 300 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకొని తిరువలం ఆహార శాఖ గిడ్డంగిలో అప్పగించారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం



20 మంది తమిళ జాలర్ల విడుదల

పెరంబూర్, ఫిబ్రవరి 16: శ్రీలంక జైలులోఉన్న 20 మంది తమిళ జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. రామేశ్వరం నుంచి చేపల వేటకు వెళ్లిన జాలర్లు సరిహద్దు దాటారంటూ వారం రోజుల క్రితం శ్రీలంక నావికాదళం 20 మంది జాలర్లను అరెస్ట్ చేసి, రెండు పడవలు స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో, జైలులో ఉన్న జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసిందని, మరో రెండు, మూడు రోజుల్లో జాలర్లు తిరిగిరానున్నారని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

జీసీసీలో ఖాళీ పోస్టులు భర్తీచేయాలి

● రెడ్‌ఫ్లాగ్ సంఘం డిమాండ్

పార్యీస్, ఫిబ్రవరి 16: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలని సీఐటీయూ నిర్వహణలోని రెడ్ ఫ్లాగ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నగరంలోని రిప్పన్ భవనం ప్రాంగణంలో శుక్రవారం కార్పొరేషన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో మలేరియా, రోడ్లు, పారిశుధ్య కార్మికుల విభాగాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురి అరెస్ట్

పార్యీస్, ఫిబ్రవరి 16: స్థానిక పెరుంబాక్కంలో జనవరిలో సాధన (21) అనే హిజ్రాను దారుణంగా హత్యచేసి పరారైన నలుగురు హిజ్రాలను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈనెల 3వ తేది పెరుంబాక్కం ప్రాంతంలో 60 కిలోల గంజాయితో ఐదుగురు హిజ్రాలు పట్టుబడ్డారు. వారి వద్ద జరిపిన విచారణలో, హిజ్రా సాధన హత్యకేసులో వీరికి సంబంధాలున్నట్లు తెలిసింది. ఆనంది (27), రతి (36), అబి (32), అపర్ణ (27) అనే ఈ నలుగురిపై హత్య కేసు నమోదుచేసి కోర్టు ఉత్తర్వులు మేరకు పుళల్ జైలుకు తరలించారు.

మిత్రుడి హత్యకేసులో ....

స్థానిక పట్టాభిరాంలో మిత్రుడిని హతమార్చిన కేసులో ముగ్గురికి యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ పూందమల్లి న్యాయస్థానం తీర్పు వెలువరించింది. పట్టాభిరాం అమ్మన్ కోయిల్ వీధికి చెందిన ప్రభాకరన్ (40), కలియమూర్తి (45) అనే మిత్రులు ఫైనాన్స్ సంస్థను ప్రారంభించి వాహనాల కొనుగోలుకు రుణాలు పంపిణీ చేసేవారు. కొన్నాళ్ల తర్వాత వీరిద్దరు విభేధాల కారణంగా విడిపోయారు. ఈ నేపథ్యంలో, 2013వ సంవత్సరం ప్రభాకరన్‌ను విందుకు ఆహ్వానించిన కలియమూర్తి తన మిత్రులు కొలంజీ, దామోదరన్ తో కలసి హత్య చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో పూందమల్లి న్యాయస్థానం న్యాయమూర్తి బాలకృష్ణన్ గురువారం, నిందితులు ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్ష, తలా రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వల్లిమలై ఆలయ హుండీ ఆదాయం రూ.13 లక్షలు

వేలూరు, ఫిబ్రవరి 16: కాట్పాడి తాలూకా వల్లిమలై సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.13,12,185 నగదు, 101.5 గ్రాముల బంగారం, 401 గ్రాముల వెండి కానుకలుగా సమర్పించారు. హిందూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జీవరత్నం, ఇన్‌స్పెక్టర్ సురేష్, నిర్వాహక అధికారి తిరునావుక్కరసు, మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు.



అన్నాడీఎంకే - బీజేపీ పొత్తు కోసం జీకే వాసన్ మధ్యవర్తిత్వం

అడయార్, ఫిబ్రవరి 16: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే - బీజేపీ మధ్య సయోధ్య కుదర్చి, పొత్తు పెట్టుకునేలా చేసేందుకు టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ ప్రయత్నం చేశారు. ఇందుకోసం ఆయన మాజీ ముఖ్యమంత్రి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వద్దకు మధ్యవర్తిగా వెళ్లారు. కానీ, ఆయన బీజేపీతో చేతులు కలిపేందుకు ససేమిరా అనడంతో వాసన్ నిరాశతో వెనుదిరిగారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే, డీఎండీకేలు కలిసి ఏర్పడే కూటమి బలంగా ఉంటుందని జీకే వాసన్ భావిస్తున్నారు. దీంతో ఆయన రంగంలోకి దిగి... అన్నాడీఎంకే - బీజేపీ మధ్య పొత్తు కుదిర్చేందుకు తన వంతు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో నిరాశ చెందినట్టు సమాచారం.

పీచు మిఠాయిలో క్యాన్సర్ కారక రసాయనం

పెరంబూర్, ఫిబ్రవరి 16: నగరంలో స్వాధీనం చేసుకున్న పీచు మిఠాయిలో క్యాన్సర్ వ్యాధి కలుగజేసే రసాయనం వినియోగిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. పుదుచ్చేరి నగరంలో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న అధికారులు, వాటి నమూనాలను పరిశోధనలకు పంపారు. ఆ పీచు మిఠాయిలో 'రోడమైన్ బి' అనే రసాయనం కలిసినట్లు పరిశోధనల్లో తేలడంతో, తదుపరి చర్యలపై చర్చిస్తున్నట్లు ఆహార భద్రతా శాఖ అధికారులు తెలిపారు.

20 వరకు సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 16: మాజీ మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను ఈనెల 20వ తేది వరకు పొడిగించారు. చట్టవ్యతిరేక నగదు బట్వాడా చట్టం కింద అరెస్టయిన సెంథిల్ బాలాజి పుళల్ జైలులో బందీగా ఉన్నారు. ఆయన దాఖలు చేసిన బెయిలు పిటిషన్లు మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టులు తోసి పుచ్చాయి. ఈ నేపథ్యంలో, ఆయనకు విధించిన రిమాండ్ శుక్రవారం ముగియనడంతో, పుళల్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లి ఎదుట హాజరుపరచగా, 21వ సారిగా ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు, ఫిబ్రవరి 16: పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ రమేష్ తెలిపారు. శుక్రవారం ఎస్ఈబీ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా సమీపంలో వాహనాలను తనిఖీ చేసేందుకు ఎస్ఈబీ సిబ్బంది వెళ్తుండగా ఇద్దరు రోడ్డుపై బ్యాగులతో అనుమానాస్పదంగా ఉండడంతో తనిఖీ చేశారు. బ్యాగుల్లో 10 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన సంజయ్‌కుమార్, ముల్లైకడైపట్టికి చెందిన ఆకాష్ అని తెలిపింది. వీరు ఆంధ్ర రాష్ట్రం అనకాపల్లి జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకు తరలించి విక్రయిస్తుంటారని విచారణలో తేలింది.



గంజాయి, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

20 కిలోల గంజాయితో కేరళవాసి అరెస్ట్

పార్యీస్, ఫిబ్రవరి 16: స్థానిక మడిపాక్కం ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేరళకు చెందిన విష్ణును అరెస్ట్ చేశారు. మడిపాక్కంలో వలస కార్మికులు, విద్యార్థులకు గుట్టుగా గంజాయి విక్రయిస్తున్నట్లు పల్లావరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివానంద్‌కు సమాచారం తెలిసింది. ఆయన నేతృత్వంలోని సిబ్బంది గురువారం సాయంత్రం మడిపాక్కంలో సంచితో సంచరించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. అతని సంచి తనిఖీచేసి, అందులో ఉన్న 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతను కేరళ రాష్ట్రం కొలికోడ్‌కు చెందిన విష్ణుగా గుర్తించారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

డీఎంకే 'మేనిఫెస్టో' టూర్‌లో మార్పులు

అడయార్, ఫిబ్రవరి 16: పార్లమెంట్ ఎన్నికల కోసం మేనిఫెస్టోను రూపొందించేందుకు డీఎంకే కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ పర్యటనలో కొన్ని స్వల్ప మార్పులు చేసింది. ఈనెల 23న వేలూరు, రాణిపేట, తిరుపత్తూరు, ఆరణి, తిరువణ్ణామలై నార్త్, 26వ తేదీన తంజావూరు, తిరుచ్చి, పుదుక్కోట, విల్లుపురం, కడలూరు, అరియలూరు, పెరంబలూరు, 27వ తేదీన చెన్నై, కాంచీపురం, తిరువళ్ళూరు, 28న మరోమారు చెన్నై జిల్లాలో పర్యటించి అభిప్రాయాలను సేకరించనుంది.

లబ్ధిదారులకు రూ.3.26 కోట్ల సహాయాల పంపిణీ

వేలూరు, ఫిబ్రవరి 16: 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథక లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల పంపిణీని వేలూరు జిల్లాలోని ఆనైకట్టు టీవీఆర్ మహల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్ పాల్గొని 514 మందికి వివిధ శాఖల తరపున రూ.3.24 కోట్ల సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, అములు విజయన్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్ కుమార్, ఆనైకట్టు యూనియన్ కమిటీ అధ్యక్షుడు భాస్కరన్, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తీ, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహాయాలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్



20న అనుపమాన సంగీత గేయధార

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'ఐక్యూఏసీ', 'సృజన తెలుగు భాషా మండలి' సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20న 'అనుపమాన సంగీత గేయధార', 'భాష అభిలాష సన్మాన సంబరాలు' జరగనున్నాయి. పార్యీస్‌లో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి కళాశాల రజతోత్సవాలను పురస్కరించుకుని ఎస్‌కేపీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సంగీత సాహితీచంద్ర సాయికృష్ణ యాచేంద్ర ఆధ్వర్యంలో 'అనుపమాన సంగీత గేయధార' ప్రారంభం కానుండగా ప్రాశ్నికులుగా ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర, ప్రముఖ రచయిత డాక్టర్ కాసల నాగభూషణం, నూకల హనుమంతరావు, శోభారాజు, డాక్టర్ పీఎస్ మైథిలి వ్యవహించనున్నారు. డాక్టర్ టి.మోహనశ్రీ ఈ కార్యక్రమానికి సంచాలకులుగా వ్యవహరించనున్నారు. తాంబరంలోని మద్రాస్ క్రైస్తవ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ ఎస్.యజ్ఞశేఖర్, కేజీ కండ్రిగలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎ.మునిరత్నంకు 'ధ్రువతార' పురస్కారం, తమిళనాడు తెలుగు ప్రజల సమాజం వ్యవస్థాపకుడు దేవరకొండ రాజు, మన తెలుగు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ లావణ శ్రీనివాస్‌కు 'అభిజ్ఞ' పురస్కారం, హరిజన సేవా సంఘం తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు పి.మారుతికి 'ఉద్భవ' పురస్కారం ప్రదానం చేయనున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సినీ గేయ రచయిత భువనచంద్ర ముఖ్య అతిథిగా హాజరై పురస్కార గ్రహీతలను సత్కరించనున్నారు.

రామేశ్వరంలో నకిలీ కోటి తీర్థం విక్రయం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: రామేశ్వరంలో నకిలీ కోటి తీర్థం విక్రయాలు జరుగుతున్నాయి. రామేశ్వరం ఆలయ ప్రాంగణంలో ఉన్న 22 తీర్థాలలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శనం చేసుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఒక్కో తీర్థానికి ఒక్కో మహిమ ఉంటుంది. వాటిలో 22వ తీర్థమైన కోటి తీర్థంలో స్నానమాచరిస్తే అన్ని తీర్థాల్లో స్నానమాచరించిన ఫలితం దక్కుతుందన్నది భక్తుల విశ్వాసం. దీంతో ఆలయ అధికారులు పలు సంవత్సరాలుగా కోటి తీర్థాన్ని 500 మి.లీ బాటిల్‌ను రూ.20కి విక్రయిస్తున్నారు. ఈ విక్రయాలు ఆలయ 2,3 ప్రాకారాల్లో ఉన్న దుకాణాల్లో జరుగుతుండగా, గత కొన్నిరోజులుగా ఆలయ తూర్పు, పశ్చిమ ద్వారాలు, సన్నిధి వీధిలో ఉన్న దుకాణాల్లో కొందరు వ్యాపారులు రూ.50కు కోటి తీర్థం పేరుతో నకిలీ తీర్థాన్ని విక్రయిస్తున్నారు. ఆలయ కోటి తీర్థ విక్రయాలకు ప్రైవేటు అనుమతివ్వలేదని, అలా విక్రయించే వారిని గుర్తించి పోలీసులకు అప్పగిస్తామని హిందూ దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

రైతుల పరిహారానికి రూ.16.85 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 16: నైరుతి రుతుపవనాలు ఆశించినంతగా కురవకపోవడంతో, డెల్టా జిల్లాల్లో 22,533 హెక్టార్ల సంబా వరి పంట దెబ్బతింది. నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు రాష్ట్ర విపత్తుల నివారణ నిధుల నుంచి రూ.16.85 కోట్లు కేటాయించారు. నాగపట్టినం, మైలాడుదురై, తిరువారూర్, తంజావూరు జిల్లాల్లో గత ఏడాది వర్షాలు లేక పంటలు ఎండిపోయాయి. 33 శాతం పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.13,500 పరిహారం ఇస్తామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు మైలాడుదురై జిల్లాలో 17మంది రైతులకు రూ.2.37 లక్షలు, నాగపట్టినం జిల్లాలో 21,816 మంది రైతులకు రూ.16.37 కోట్లు, తంజావూరులో 77 మంది రైతులకు రూ.7.52 లక్షలు, తిరువారూరు జిల్లాలో 623 మంది రైతులకు రూ.38.47 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

19నుంచి మళ్లీ శాసనసభ సమావేశాలు

పెరంబూర్, ఫిబ్రవరి 16: మూడు రోజుల సెలవుల అనంతరం ఈనెల 19న శాసనసభ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈనెల 12న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన సమావేశాల్లో, రెండు రోజులు గవర్నర్ ప్రసంగంపై చర్చ జరగ్గా, సీఎం స్టాలిన్ సమాధానమిచ్చారు. శుక్రవారం నుంచి మూడు రోజులు సమావేశాలకు సెలవు ప్రకటించగా, 19వ తేది నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆ రోజున 2024-25వ వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు దాఖలు చేయనున్నారు.

'బొంగరం' గుర్తు కేటాయించండి

● ఈసీకి ఎండీఎంకే లేఖ

పెరంబూర్, ఫిబ్రవరి 16: గత పార్లమెంటు ఎన్నికల్లో ఎండీఎంకే అభ్యర్థులు... డీఎంకే చిహ్నం 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై పోటీ చేశారు. ఈసారి ఎన్నికల్లో తమ గుర్తు 'బొంగరం'పై పోటీ చేయాలని ఆ పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థులకు బొంగరం గుర్తు కేటాయించాలని ఎండీఎంకే రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహును గురువారం ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో కలుసుకొని లేఖ అందజేశారు.

'డీఎంకే' అభ్యర్థుల ఫీజు రూ.52,000

పెరంబూర్, ఫిబ్రవరి 16: పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలనుకొనే ఆశావాహులు ముఖ్యమంత్రి సీఎం స్టాలిన్ జన్మదినమైన మార్చి 1వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ప్రకటించారు. స్థానిక తేనాంపేటలోని పార్టీ కార్యాలయంలో ఈనెల 19వ తేది నుంచి దరఖాస్తులు పొంది, పూర్తి వివరాలు నమోదుచేసి మార్చి 1 నుంచి 7వ తేది సాయంత్రం 6 గంటల్లోపు సమర్పించాలి. అభ్యర్థుల దరఖాస్తు ఫీజుగా రూ.50,000, దరఖాస్తు ఫారం రుసుంగా రూ.2,000 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, గత పార్లమెంటు ఎన్నికల్లో ఆశావాహుల నుంచి దరఖాస్తు రుసుముగా రూ.25,000 తీసుకోగా, రాబోయే ఎన్నికల్లో రుసుము రెట్టింపు కావడం గమనార్హం.

ఓట్టేరిలో కనిపించిన వండలూరులో తప్పించుకున్న వానరం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 16: వండలూరు జులాజికల్ పార్కులో అదృశ్యమైన రెండు హనుమాన్ వానరాల్లో ఒకటి ఓట్టేరిలో కనిపించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ నుంచి 10 హనుమాన్ వానరాలను వండలూరుకు దిగుమతి చేసుకున్నారు. ప్రత్యేక బోనులో ఉంచిన ఆ వానరాల్లో రెండు ఈనెల 13వ తేది అదృశ్యమయ్యాయి. వాటికోసం ముగ్గురితో ఏర్పడిన బృందం గాలిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆ వానరాలు ఓట్టేరి ఎక్స్‌టెన్షన్ కాలనీలో సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఓ ఇంటి ప్రహరీపై కూర్చున్న వానరాన్ని గుర్తించిన ఈ బృందం ఆ ప్రాంతంలో గాలిస్తోంది.

యూట్యూబ్ వీడియోలు సమర్పించండి

● సాట్టై దురైమురుగన్‌కు ఎన్ఐఏ ఉత్తర్వులు

పార్యీస్, ఫిబ్రవరి 16: యూట్యూబ్‌లో నమోదు చేసిన వీడియోలు సమర్పించాలని నామ్ తమిళర్ కట్చి నిర్వాహకుడు సాటై దురైమురుగన్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10కి పైగా ప్రాంతాల్లో సుమారు 50 మంది ఎన్ఐఏ అధికారులు నామ్ తమిళర్ పార్టీ నాయకుల ఇళ్లు, కార్యాలయాల్లో ఇటీవల సోదాలు నిర్వహించారు. తిరుచ్చి షణ్ముగనగర్‌లో ఉన్న ఆ పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి, ప్రచారకర్త, యూట్యూబర్ సాట్టై దురైమురుగన్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. సుమారు మూడు గంటలు అతని భార్య వద్ద కూడా విచారణ జరిపి పలు కీలక వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో, యూట్యూబ్ వీడియోలను స్థానిక పురుషవాక్కంలో ఉన్న కార్యాలయంలో సమర్పించాల్సిందిగా దురైమురుగన్‌కు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సిమెంటు దిమ్మె విరిగిపడి వలస కార్మికుడి మృతి

పార్యీస్, ఫిబ్రవరి 16: స్థానిక వడపళనిలో పాత భవనానికి మరమ్మతులు చేస్తున్న సమయంలో సిమెంటు దిమ్మె విరిగిపడి వలస కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వడపళని వల్లియమ్మాళ్ వీధిలో శ్రీరామ్ ఇంటి మరమ్మతులకు నుంగంబాక్కానికి చెందిన అభిషేక్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. ఆయన వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన షమీన్‌షేక్ (23)తో పాటూ సుమారు 10 మందికి పైగా పని చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం పనిచేస్తున్న షమీన్‌షేక్‌పై సిమెంట్ దిమ్మె విరిగిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వంద పాఠశాలల్లో హరిత పథకం

● మంత్రి మెయ్యనాథన్

పార్యీస్, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో 100 పాఠశాలల్లో హరిత పథకం అమలుపరిచేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి మెయ్యనాథన్ పేర్కొన్నారు. అసెంబ్లీలో అటవీ శాఖకు సంబంధించిన ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు. వారికి మంత్రి మెయ్యనాథన్ సమాధానం చెబుతూ... తిరువారూర్ జిల్లాలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో మొక్కల పెంపకం పథకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.75 లక్షలతో మొక్కలు కొనుగోలు చేసినట్లు వివరించారు. పాఠశాల, కళాశాలల్లో మొక్కలు నాటడం మాత్రమే కాకుండా హరిత పథకం కింద రూ.20 లక్షలతో మూలికా వనం, సోలార్ విద్యుత్, కూరగాయల తోట, వాన నీటి సంరక్షణ తదితరాలు కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లతో వంద పాఠశాలల్లో హరిత పాఠశాల పథకాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు మంత్రి తెలిపారు.

23 నుంచి సెలెబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు

● చెన్నై రైనోస్ కెప్టెన్‌గా ఆర్య



విలేకరుల సమావేశంలో పాల్గొన్న చెన్నై రైనోస్ జట్టు

అడయార్, ఫిబ్రవరి 16: ఈనెల 23వ తేదీ నుంచి సెలెబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్) ప్రారంభంకానుంది. ఇందులో చెన్నై రైనోస్, ముంబై హీరోస్, కర్నాటక బుల్డోజర్స్ తెలుగు వారియర్స్, భోజ్‌పురి దబాంగ్స్, బెంగాల్ టైగర్స్ కేరళ స్ట్రైకర్స్, పంజాబ్ ది షేర్ జట్లు తలపడనున్నాయి. ఈ క్రికెట్ పోటీలకు అనేక మంది అగ్రహీరోలు హాజరవుతుండటంతో ఈ టోర్నీపై అంచనాలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై రైనోస్ జట్టు పరిచయ కార్యక్రమం శుక్రవారం నగరంలో జరిగింది. ఇందులో జట్టు కెప్టెన్ ఆర్య, సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణు ఇంటూరి, సభ్యులైన విష్ణు విశాల్, జీవా, మిర్చి శివ, శంతను, విక్రాంత్, భరత్, పృథ్వీ, అశోక్ సెల్వన్, కలై యరసన్, ఆదవ్ కన్నదాసన్, ఎస్‌జే సత్య, దాశరథి, షరఫ్ పాల్గొన్నారు. ఈనెల 23న ప్రారంభమయ్యే ఈ టోర్నీ మార్చి 17వ తేదీ వరకు షార్జా, హైదరాబాద్, చండీగఢ్, తిరువనంతపురం వేదికల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ టోర్నీ 20 మ్యాచ్‌లు తమిళంలో విజయ్ సూపర్ చానెల్‌తో పాటు డీడీ స్పోర్ట్స్ జియో సినిమాస్‌లో ప్రసారం కానుంది. ప్రారంభ మ్యాచ్ షార్జాలో, క్వాలిఫయర్, ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్‌లు వైజాగ్‌లో నిర్వహిస్తారు. విలేకరుల సమావేశంలో హీరో ఆర్య మాట్లాడుతూ... మ్యాచ్ కోసం మైదానంలోకి దిగినపుడు సినిమాటిక్స్‌ను పక్కనబెట్టి పూర్తిగా గేమ్‌పై దృష్టి సారిస్తామన్నారు. సీసీఎల్ ఎంతో ఆరోగ్యకరమైన క్రీడతో పాటు సరదాగా సాగిపోయే టోర్నీ అని, ఇందులో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణు ఇంటూరి మాట్లాడుతూ... సీసీఎల్‌లోని ఇతర టీంలతో పోల్చితే తమ జట్టు ఎంతో బలంగా, ఫేవరేట్‌గా ఉందని, మ్యాచ్‌లన్నీ డే అండ్ నైట్‌గా సాగుతాయని తెలిపారు.



చెన్నైలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని కలుసుకుని పార్టీ సభ్యత్వం స్వీకరిస్తున్న మక్కల్ నీదిమయ్యం ఐటీ విభాగం కార్యదర్శి కృపాకరన్



ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం సమీపంలో రేషన్‌షాపుల్లో పామాయిల్‌కు బదులు కొబ్బరి, వేరుశనగ నూనెలను సరఫరా చేయాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్న మహిళా రైతు సంఘ సభ్యులు





కనులపండువగా రథసప్తమి వేడుకలు

కిటకిటలాడిన తిరుమల మాడవీధులు

సప్త వాహన సౌందర్యం


తిరుమల, ఆంధ్రజ్యోతి

మలయప్ప స్వామి సప్త వాహన సేవల ఊరేగింపులతో తిరుమల గిరులు పులకించిపోయాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలు, కర్పూర హారతులు, భజన బృందాల ప్రదర్శనలతో మాడవీధులు మార్మోగాయి.శుక్రవారం ఉదయం 5.30గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన వాహనసేవలను అశేష సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా 24గంటల పాటు గ్యాలరీల్లోనే ఉండి శ్రీనివాసుడి దర్శన భాగ్యంతో ఆనందపరవశులయ్యారు. సూర్యప్రభ వాహనసేవ సందర్భంగా శ్రీవేంకటేశ్వర బాలమందిరం విద్యార్థులు ఆలపించిన 'ఆదిత్యహృదయం', 'సూర్యాష్టకం' సంస్కృత శ్లోకాలు భక్తుల మనసుదోచాయి. వాహనసేవల్లో హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 900మంది కళాకారులు పాల్గొన్నారు. కోలాటం, లెజిమ్స్, దీపనృత్యం, కేరళ-ఓనం నృత్యం, జానపద నృత్యం, గోపికా నృత్యం, హారతి నృత్యం, అన్నమయ్య విన్నపాల నృత్యం, రాజస్థాన్-దాండియా నృత్యం, పుదుచ్చేరి-కరగాట్టం ,మోహినీ అట్టం, తెలంగాణ-గర్బ నృత్యం, బిందెల నృత్యం, కూచిపూడి నృనత్యం, మహారాష్ట్ర లావణి నృత్యం, అస్సోం-భుయ నృత్యం, బెంగాలీ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు.



మాడవీధులను వీడని భక్తులు

రథసప్తమి వేడుకలను తిలకించడానికి గురువారం సాయంత్రం నుంచే భక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడం మొదలుపెట్టారు.సాధారణంగా సూర్యప్రభ వాహనం నుంచి చక్రస్నానం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. తర్వాత నెమ్మదిగా తగ్గుతుంది. అయితే ఈసారి మాత్రం భక్తులు ఎక్కడి వారు అక్కడే కూర్చుండిపోయారు. రాత్రి 9 గంటల వరకు గ్యాలరీల్లోనే ఉండి వాహనసేవలన్నీ వీక్షించారు. అయితే ఎక్కడి నుంచి గ్యాలరీల్లోకి ప్రవేశించాలనే సమాచారం తెలియక చాలామంది ఇబ్బంది పడ్డారు.భక్తులతో కొన్నిచోట్ల భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, రాంభగీచ వద్ద తీవ్రస్థాయిలో నెట్టడం విమర్శలకు దారితీసింది.



అయన ఒక విశ్వవిఖ్యాత తాత్వికుడు. 60 సంవత్సరాలపాటు నిర్విరామంగా ప్రపంచమంతా పర్యటించి, సత్యాన్వేషణే మానవుడిని సమస్త బంధనాల నుంచి, దుఃఖాల నుండి విముక్తుడిని చేయగలదని, అది ఎవరికి వారు అంతర్ముఖులై చేయవలసిన సాధన అని, దాని కోసం ఏ మతాలను, సంస్థలను, గురువులను ఆశ్రయించవలసిన అవసరం లేదని విశదపరుస్తూ, అనన్యమైన తీరులో ప్రసంగిస్తూ, అసంఖ్యాకమైన ప్రజలను వారి సమస్యలకు, సందేహాలకు తన అపూర్వమైన సమాధానాల ద్వారా ప్రభావితం చేసిన బోధకుడు జిడ్డు కృష్ణమూర్తి. విశాల దృక్పథంతో చూస్తే ఆయన విశ్వగురువు. కొంచెం సంకుచితంగా చూస్తే మన తెలుగువాడు, మన మద్రాసుతో అవినాభావ సంబంధం కలవాడు. - వేళచ్చేరి

విశ్వవిఖ్యాత తాత్వికుడు

● నేడు జిడ్డు కృష్ణమూర్తి వర్ధంతి

బాల్యం...

జిడ్డు కృష్ణమూర్తి 1895 మే 11న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లెలో జన్మించారు. తండ్రి నారాయణయ్య రెవెన్యూ శాఖలో చిన్న ఉద్యోగి. కృష్ణమూర్తి చిన్నతనంలో తరచూ అనారోగ్యంతో చదువులో వెనకబడి ఉండేవాడు. 1905లో తల్లి సంజీవమ్మ చనిపోయింది. 1909లో నారాయణయ్య రిటైరైన తర్వాత కుటుంబాన్ని మద్రాసుకు తరలించి, అడయారులోని దివ్యజ్ఞాన సమాజంలో అనిబిసెంట్ వద్ద గుమస్తాగా చేరారు. దివ్యజ్ఞాన సమాజంలో పనిచేస్తున్న సి.డబ్ల్యు లెడ్ బీటర్ దృష్టిని ఆకట్టుకున్నాడు కృష్ణమూర్తి. దివ్యజ్ఞాన సామాజికులు ఒక అవతార పురుషుడి కోసం అన్వేషిస్తున్నారు. లెడ్ బీటర్‌కు కృష్ణమూర్తిలో ఏ మాత్రం స్వార్థ జాడ లేని తేజోవలయం గోచరమైంది. అతనితో పాటు అనిబిసెంట్ కూడా, కృష్ణమూర్తి పూర్వజన్మలు ఉత్తమమైనవని, నవ్యమైన పద్ధతిలో సిద్ధపరుస్తే అవతార పురుషుడౌతాడని నమ్మారు. కాబోయే జగద్గురువుగా అతనిని విద్యావంతుణ్ణి చేయడానికి వారు నిశ్చయించుకున్నారు. ఆ విధంగా కృష్ణమూర్తి, ఆయన సోదరుడు నిత్యానంద దివ్యజ్ఞాన సమాజంలో చేరారు.

ఆధ్యాత్మిక పథంలో ప్రయాణం...

కృష్ణమూర్తికి, ఆయన సోదరుడు నిత్యానందకు, నాగరికమైన యూరోపియన్ పద్ధతుల్లో జీవించడంలో శిక్షణ ఇచ్చారు. ఆహార, ఇతర అలవాట్లు, నవీనమైన దుస్తులు, గుర్రపు స్వారీ, క్రికెట్, 9 సంవత్సరాలు ఇంగ్లండ్, యూరప్‌లో విద్యాభ్యాసం- ఇవన్నీ అందులో భాగాలు. కాని కృష్ణమూర్తికి క్రమంగా ఈ నవ్య ఆలోచనా ధోరణులు, బోధనా పద్ధతులలో ఆసక్తి క్షీణించసాగింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో, తదనంతరం, నిజమైన శాంతిని అన్వేషించకుండా అందరూ శుష్క ఆదర్శాలు వల్లెవేయడం అయన్ని కలవరపరిచింది. 1920 కల్లా, దివ్యజ్ఞాన సమాజ సిద్ధాంతాలు మానవ సమస్యల పరిష్కారానికి ఏ విధంగా ఉపయోగపడతాయన్న సందేహం కృష్ణమూర్తిలో కలిగింది.

అంతర్మథనం... ఆత్మసాక్షాత్కారం

ధార్మిక సిద్ధాంతాలతోను, అతీంద్రియ శక్తులపై విశ్వాసంతో నిండి ఉన్న దివ్యజ్ఞాన మార్గం మానవజాతి అనుభవిస్తున్న దుఃఖాన్ని సూటిగా తాకడంలేదని కృష్ణమూర్తి భావించారు. నా బాధ్యతలేమిటి, కర్తవ్యం ఏమిటి అన్నది నా అంతట నేనే గ్రహించడానికి అవకాశం కావాలి అనుకున్నారు. 1922లో కేలిఫోర్నియాలోని ఓ హాలులో ప్రశాంతమైన పరిసరాలలో ఏకాంత జీవనం అభిలషించారు. క్షయ వ్యాధి సోకిన సోదరుడు నిత్యానంద మాత్రమే వెంట ఉన్నారు. కృష్ణమూర్తి అధ్యయనానికి, ధ్యానానికి అది అనువైన ప్రదేశం. అక్కడ కలిగిన అనుభవాలను గురించి ఆయన ఇలా రాసుకున్నారు.

"నేను కాంతిని దర్శించాను. దుఃఖాన్ని, బాధను నయం చేసే కారుణ్యాన్ని నేను అందుకున్నాను. ఆ కారుణ్యం నా కోసం కాదు, ఈ ప్రపంచం కోసం. ఇక మళ్లీ అంధకారం ఎన్నడూ నన్ను తాకలేదు... ఆనందమూ, అనంత సౌందర్యమూ అనే స్రవంతిలో నేను ఓలలాడాను. దైవత్వం నన్ను పరవశత్వంలో ముంచివేసింది... నా లోపల, అగాధమైన కొలనుకు అట్టడుగున ఉండే నెమ్మది ఉన్నది. ఆ కొలనులాగే, నా దేహాన్ని, నా మనసునీ, అందులోని ఉద్వేగాలనూ, ఉపరితలం మీద అలలు కదిలించవచ్చును గాని, నా ఆత్మలోని నెమ్మదిని మాత్రం ఏదీ అలజడి చేసి చెరపలేదు."

దివ్యజ్ఞాన సమాజంలో చేరినప్పటి నుంచి కృష్ణమూర్తి సోదరుడు నిత్యానంద ఆయన వెంటే ఉంటూ సంపూర్ణమైన అవగాహనతో ఆయన ఆలోచనలనూ అనుభవాలను పంచుకున్నారు. నిత్యానంద 1925 నవంబరులో ఒహైవోలో క్షయవ్యాధితో మరణించారు. ఆ సమయంలో, దివ్యజ్ఞాన సమాజం వారి స్వర్ణోత్సవాలలో పాల్గొనేందుకు ఓడలో భారతదేశం వెళ్తున్న కృష్ణమూర్తిని ఈ వార్త కలచివేసింది. స్వర్ణోత్సవాల తదనంతరం, కృష్ణమూర్తిలో దివ్యజ్ఞాన సిద్ధాంతాల పట్ల అసంతృప్తి, తిరుగుబాటు తీవ్రమైంది. గత జన్మల గురించి, ఇతర లోకాల గురించి చర్చించడం నిష్ప్రయోజనమని, ఈ ప్రపంచానికి, ప్రస్తుత జీవితానికి చెందిన సమస్యలపై దృష్టిని కేంద్రీకరించడమే కర్తవ్యమని, సందేహించడం, ప్రశ్నించడమే ఆధ్యాత్మిక విచారణకు సరైన పద్ధతి అని, ఏ మతాలు, గురువులు, సమాజాలు దీనిలో సహాయపడలేవని ఆయన నిశ్చయించుకున్నారు.

1929లో హాలెండ్‌లో జరిగిన సమావేశంలో ఆ సంస్థని, దాని అనుబంధ సంస్థలనూ రద్దు చేసి ఆ బంధనాల నుంచి విముక్తులై స్వేచ్ఛగా నిలబడ్డారు. "సత్యం బాటలు లేని సీమ' అని ప్రకటించారు.

అప్పటి నుండి కృష్ణమూర్తి తమ జీవితాంతం దేశ విదేశాలలో పర్యటిస్తూ తమ ప్రసంగాలు, వ్యాసాలు, చర్చలు, సంవాదాలు, లేఖలు, సందేహాలకు సమాధానా ద్వారా, నిత్య జీవితంలో ప్రతి మనిషీ ఎదుర్కొనే సమస్యలను పూర్తిగా మౌలికమైన, ఒక నవ్య దృష్టితో పరికించి విశదీకరించారు. అయితే, సత్యాన్వేషణలో ఇతరులకు తను ఒక సహచరుడు మాత్రమేనని, తనని ఒక గురువుగానో ఆచార్యుడుగానో భావించవద్దని, తను చెప్పే విషయాలను ఒక సిద్ధాంతంగానో భావించవద్దని, ఆ విషయాలను సిద్ధాంతంగానో, మతంగానో పరిగణించవద్దని ఆయన స్పష్టం చేశారు. 1986 ఫిబ్రవరి 17న ఒహైవోలో కృష్ణమూర్తి తుది శ్వాస వదిలారు.

దివ్యజ్ఞాన సమాజం...

1875లో హెలెనాల పెట్రోవ్నా బ్లావట్‌స్కీ అనే రష్యా దేశస్థురాలు దివ్యజ్ఞాన సమాజాన్ని అమెరికాలో స్థాపించారు. దివ్యజ్ఞాన సామాజికుల సిద్ధాంతం ప్రకారం మానవ జీవితం, భూతలం నుంచి దివ్యలోకాల వైపుకు పోయే గమనంలో ఒక దశ. మానవజాతి, అతీంద్రియ శక్తులను ఉపయోగించడం ద్వారా, మతం, తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రాలను మేళవించి, తమలో అజ్ఞాతంగా ఉన్న శక్తులను, ప్రకృతిలో నిగూఢంగా ఉన్న రహస్యాలను వెలికితీసి, తమ కంటే ఉన్నత స్థితిలో ఉన్న మరో లోకంలోకి అడుగుపెడుతుందని వారు విశ్వసిస్తారు. ఈ విముక్తి మార్గం చూపడానికి అఖండ జ్ఞానం, నిగూఢమైన సిద్ధులు కలిగి ఉన్న ఆధ్యాత్మిక గురువులు ఉంటారని కూడా వారు విశ్వసిస్తారు. 1882లో బ్లావట్‌స్కీ దివ్యజ్ఞాన సమాజం ప్రధాన కార్యాలయాన్ని మద్రాసు నగరానికి తరలించారు. అడయారులోని 260 ఎకరాల సువిశాల వనంలో నిర్మితమైన ఈ కార్యాలయం ఈనాటికీ ఎందరో జిజ్ఞాసువులను ఆకర్షిస్తూ ఉంటుంది. 60,000 మీటర్ల మేర విస్తరించిన, 450 సంవత్సరాల పురాతనమైన మర్రిచెట్టు ఇక్కడ ఒక ఆకర్షణ. దివ్యజ్ఞాన సమాజం ఆదర్శాలకు ఆకర్షితులైన వారిలో అనిబిసెంట్ ఒకరు. ఇంగ్లండులో అనేక ప్రగతివాద, సాంఘిక ఉద్యమాల్లో పాల్గొని, మహిళా హక్కుల కోసం పోరాడి, స్వేచ్ఛావాదులతో కలసి పనిచేసిన ఆమె 1879లో భారతదేశానికి వచ్చి, దివ్యజ్ఞాన సమాజంలో చేరి, దానికి అధ్యక్షురాలయ్యారు. అనిబిసెంట్ 1909 నవంబరులో కృష్ణమూర్తికి ఉపదేశదీక్ష ఇచ్చి రహస్య సాధన విభాగంలోకి ప్రవేశపెట్టారు. ఆ మరుసటి సంవత్సరం అధ్యయన సంస్థను స్థాపించి దానికి అతనిని అధిపతిగా చేశారు.

కృష్ణమూర్తి... అభిప్రాయాలు... విశ్వాసం

వివిధ మతాల వాళ్ల నమ్మకాలు, వాళ్లు నమ్మే దేవుడి యొక్క ఆరాధన విధానాలు వేరుగా ఉంటాయి. కాని, నమ్మకం వేరు, సత్యం వేరు. సత్యం ఎప్పుడూ ఒక్కటే. అది మారదు. ఒక మతం నుంచి ఇంకో మతానికి మారే వాళ్లు ఒక నమ్మకం నుంచి మరొక నమ్మకానికి, ఒక మూఢసిద్ధాంతం నుంచి మరొక మూఢసిద్ధాంతానికి మారుతారు. కానీ సత్యాన్ని గ్రహించే స్థితికి మారలేదు. మీ మనస్సును, అభిప్రాయాలను మార్చుకోవచ్చును, కాని సత్యం అనేది, దైవం అనేది, నమ్మితే సిద్ధించేదికాదు. మూఢవిశ్వాసం మీద ఆధారపడినది కాదు. అది అనుభవంలోకి రావాలి. అది అనంతమైనది. మతాలు బోధించే సూత్రాల పరిధిలో కట్టుబడింది కాదు. ఒక మతం నుంచి మరొక మతానికి మారడం ఒక పంజరం నుంచి మరొక పంజరానికి మారడమే.

గుడ్డి నమ్మకాలు...

మనం ఒక మతాన్నో, వర్గాన్నో, దేశాన్నో మనది అనుకుంటే, లేదా ఒక గురువునో, సిద్ధాంతాన్నో అనుసరించేవారమని చెప్పకుంటే మనకు ఆ మతం, వర్గం, దేశం, గురువు, సిద్ధాంతంతో తాదాత్మ్య భావన ఏర్పడుతుంది. అటువంటి భావన సృజనాత్మకమైన అవగాహనని అంతం చేస్తుంది. అలా మమైక్యం కావటం వల్ల మూడు ప్రమాదాలు ఉన్నాయి. ఒకటి... సత్యాన్వేషణ చేసి నిజమైన ఆనందాన్ని పొందడానికి దారులు మూసుకుపోతాయి. గుడ్డిగా ఒక దాన్ని నమ్మడంతో మనం కూపస్థమండూకాలైపోతాం. రెండోది... మనం నమ్మిన మతం, గురువు, సిద్ధాంతంలో ఉన్న లోపాలు మనకి కనపడవు. మూడోది... ఎదుటి వారు నమ్మిన మతం, గురువు, సిద్ధాంతాల్లో అన్నీ లోపాలే కనిపిస్తాయి.

గురువులు...

ఈ ఆచార్యులు, ఆధ్యాత్మిక గురువులు, శిష్యులు... ఈ పద్ధతి అంతా వంటి అవివేకము. హాస్యాస్పదమూను. సహాయం అర్థిస్తూ ఒక గురువును ఆశ్రయించినప్పుడు మీరు అన్వేషిస్తున్న సత్యం కన్నా ఆ గురువే ఎక్కువ ముఖ్యం అవడంలేదూ...? సత్యం, శాంతి మనలోనే ఉన్నాయి. వాటిని కనుగొనడానికి ఏ గురువూ సహాయం చెయ్యలేడు. మనమే తెలుసుకోవాలి, అవగాహన చేసుకోవాలి. అనేక రకాల వారైన ఈ గురువులు, రకరకాలైన వారి విధానాలూ అన్నీ పరస్పర విరుద్ధంగా ఉంటాయి. వారిలో వారికి పోటీలు, ప్రచారాలు చేసుకోవడాలు-ఆ తతంగమంతా తెలిసినదే. వివేకానికి స్వీయ జ్ఞానమే ఆరంభం. దీని ద్వారా మాత్రమే శాంతిని పొందగలుగుతాం. ఆధ్యాత్మిక జీవనంలో ఆధిపత్యం చలాయించడానికి ఎవరికీ హక్కులేదు. జగద్గురువు కూడా దారినపోయే బాటసారి మాత్రమే.



యవ్వనంలో జిడ్డు కృష్ణమూర్తి

మరణం...

మనలో చాలామందికి మరణం అనేది ఒక భయానకమైన విషయం. మనం ఇట్లా భయపడుతూ ఉంటాం కాబట్టి అనేక రకాల సిద్ధాంతాలు కనిపెట్టాం. దేవుడి మీద నమ్మకం, కర్మ, పునర్జన్మ, ఆత్మ అనేది ఒకటున్నది-అది శాశ్వతం, వగైరా. ఇటువంటి ఆలోచనలను జన్మనిచ్చింది ప్రాచీనకాలం నాటి ఒక బోధకుడో, రచయితో, తత్వసిద్ధాంతాలు చేసిన ప్రవక్తో. మనం ఈ ఆలోచనలను పట్టుకుని వాటి వెనకాల వెళుతూ ఉంటాం. నిజానికి మరణం అజేయమైనది. మరణం గురించి మనకేమీ తెలియదు. దాన్ని అలాగే ఉండనిద్దాం. అది భౌతికమైన ముగింపుతో పాటు మానసిక సంబంధమైన ముగింపు కూడా. మనం జీవిస్తూ ఉండగా పూర్తి చైతన్యంతో ఉండాలి. మరణం- అది ఎలాగూ తప్పదు - కలిగినప్పుడు అది ఒక అద్భుతమైన ఘడియ కావాలి. ప్రాణంతో ఉండటమంత మహా శక్తివంతమైనది అవ్వాలి. మరణించాక ఏమవుతుందో అన్న దానిని గురించి పుస్తకాల్లో మీరు చదివిన రకరకాల వర్ణనలను పక్కకు నెట్టేసి, అద్భుతమైన ఆ స్థితిలో ఉండే అనుభూతిని అనుభవించాలి. అప్పుడు జీవించడం, మరణించడం, రెండూ ఒకటే అవుతాయి.

ధ్యానం...

ధ్యానం అంటే ఏకాగ్రత సాధించడం కాదు, ఒక ప్రత్యేకమైన విషయం మీద మనస్సుని కేంద్రీకరించే ప్రయత్నం చేయడం, దానిని నిర్బంధించడం అవుతుంది. ఒక దాని మీద ఏకాగ్రత నిలపడం అంటే తక్కిన వాటిని బహిష్కరించడం. మనసును స్థిరంగా ఒక దాని మీద నిలిపే ప్రయత్నం చేయడం, అది తిరస్కరించి ఎటో షికారు చేయడం - ఈ రెండింటి మధ్య సమరం జరుగుతూ ఉంటుంది. ఇది ధ్యానం కాదు. ధ్యానం అంటే భక్తి, ప్రార్థన కూడా కాదు. ఒక ఆలోచన మీదనో, ఆదర్శం మీదనో, బొమ్మ మీదనో భక్తి నిలపడం ధ్యానం కాదు. అది తన నుంచి పారిపోవడానికి ఒక మార్గం - అది పలాయనం మాత్రమే. ధ్యానం అంటే తనని తాను అవగాహన చేసుకొనే ఒక ప్రక్రియ. జీవితాన్ని వదిలేసి దూరంగా తొలగిపోవడం కాదు. స్వీయ జ్ఞానంతో క్రమంగా మనసు అమోఘమైన ప్రశాంతతని పొందుతుంది. ఇటువంటి నిశ్శబ్దంలో సత్యం ఉనికిలోకి వస్తుంది. అయితే, ఈ నిశ్శబ్దం హిందూ నిశ్శబ్దం కాని, క్రైస్తవ నిశ్శబ్దంకాని, బౌద్ధ నిశ్శబ్దం కాని కాదు. ఇది ఆకాశంలాగా వట్టి నిశ్శబ్దం. ఆ స్థితిలో ఒక అద్భుతమైన సృజనశీలకత అనుభవంలోకి వస్తుంది. అదే నిజమైన ధ్యానం. అటువంటి సంపూర్ణమైన స్వేచ్ఛలోనే నిశ్చలానందం ఉంది.

మతం... మార్పు

రాజకీయాల్లో పదవి కోసమో, కీర్తి కోసమో, ఆర్థిక లాభం కోసమో ఒక పార్టీ నుంచి ఇంకొక పార్టీకి మారినట్లు, మనుషులు మనశ్శాంతి కోసమో, పుణ్యలోకాల కోసమో, కష్టాల నుంచి గట్టెక్కుతామనే ఆశతోనో, కోరికలు తీరుతాయనో, మతాలు మారుతూ ఉంటారు. సత్యం ఎప్పుడూ ఇటువంటి ఆశలతో, భయాలతో సంబంధం లేకుండా ఉంటుంది. సత్యంలోని అత్యున్నత ఆనందాన్ని చవి చూడాలంటే అన్నిరకాల పూజా విధానాన్ని, సిద్ధాంత రీతుల్ని వదిలించుకోవాలి. మతం స్త్రీ పురుషులను ఒక బహుళజన సమాజంగా కట్టి వేసి ఉంచుతుంది. దైవికమైన సిద్ధాంతాలతో బంధించి ఉంచుతుంది. పుట్టుక, చావు, వివాహం మొదలైన సందర్భాల్లో ఒక మతానికి చెందిన వారందరూ కలిసి పాలుపంచుకుంటారు. పదే పదే స్తోత్రాలు జపించేవారికి, పూజా పునస్కారాల్లో పాల్గొనే వారికి తాత్కాలికంగా కొంత మనశ్శాంతి లభిస్తుంది. కాని అవి యాంత్రికంగా తయారై మనస్సుని, హృదయాన్ని బండబారేట్లు చేస్తాయి. అలవాటయిపోతాయి, అవసరమనిపిస్తాయి. ఈ ప్రక్రియని పరీక్షగా చూస్తే నిజానికి ఈ పూజా పునస్కారాలు ఆత్మజ్ఞానం కలగకుండా చేసే వ్యర్థప్రయాసలా కనిపిస్తాయి. సత్యాన్ని తెలుసుకోకుండా, తన్ను తాను గుర్తించకుండా ఏ పని చేసినా వ్యర్థమే.